క్లుప్తంగా

బాదేపల్లి బస్టాండ్‌లో బస్‌పాస్‌ల జారీ కేంద్రం

జడ్చర్ల: బాదేపల్లి బస్టాండ్‌లో బస్‌పాస్‌ల జారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కల్వకుర్తి ఆర్టీసీ డిపో అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.సోమవారం నుంచి బస్‌పాస్‌లు జారీ చేస్తామన్నారు. విద్యార్థులు బస్‌పాస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సేవలు ఉంటాయన్నారు. వివరాలకు 7382826328 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా చెన్నయ్య

గండేడ్: మండల పరిధిలోని వెన్నాచేడ్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా గుర్రాల చెన్నయ్య ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక కృష్ణదేవాలయంలో సంఘం ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా దొడ్డె బాల్‌రాజ్, లక్కగాళ్ల సత్యయ్య, ప్రధానకార్యదర్శిగా కందెనపల్లి నర్సిములు, కోశాధికారి ఏకుల శ్రీనివాస్, మచ్చ వెంకటేశ్‌లు ఎన్నికయ్యారు.

రైతులను నట్టేట ముంచుతున్నారు

మహమ్మదాబాద్: పంట కొనుగోలు చేసి సకాలంలో బిల్లులు చెల్లించకుండా రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతోందని ఉమ్మడి గండేడ్ మండల కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అంటూ ప్రగల్భాలు పలకడం తప్ప ఆచరణ శూన్యం అని అన్నారు. దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ధాన్యం బిల్లులు ఇవ్వకపోతే పెట్టుబడి ఎలా కట్టుకోగలుగుతారు అని ప్రశ్నించారు. రైతులను విస్మరించిన ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమన్నారు.

సమస్యలు తీర్చాలని వినతి

జడ్చర్ల: మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఏటీయూసీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే



నవాబుపేట: మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఫాదర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఫోరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుమారుల చేత తండ్రులకు సన్మానం చేయించి బహుమతులు అందించారు. ఫోరం నాయకులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, ఆనంతయ్య, సిద్దేశ్వర్, వెంకటయ్య, బాల్‌రాజ్, రఘు, నరేందర్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

సాయితేజకు ప్రతిభా పురస్కారం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కర్నెకోటనాగేకారి సాయితేజకు ప్రతిభా పురస్కారం లభించింది. మాస్టర్ మైండ్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో పురస్కారంతో పాటు నగదు ప్రోత్సాహకం అందజేశారు. అకాడమీ ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సాంబశివుడు పాల్గొన్నారు.

కార్యవర్గ సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతామని ప్రతినిధి జి.పాండురంగం అన్నారు. జిల్లా కేంద్రంలోని బీవీపీ కార్యాలయంలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీవీపీ సభ్యత్వాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈనెల 20న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. 2022–23 సంవత్సరానికి గాను పాలమూరు భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమశాఖగా ఎంపికైనందున కార్యవర్గసభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అక్కినేని నారాయణరావు, రమేష్‌చందర్, వీఎస్ఆర్‌కే ప్రసాద్, భూషణ్‌పాండే పాల్గొన్నారు.

గార్లపహాడ్ మండల ఏర్పాటుకు భూవిరాళం

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని ఆ గ్రామానికి చెందిన మాడ మాధవకుమార్ స్వచ్ఛందంగా ఒక ఎకరా పట్టా భూమి విరాళంగా ఇచ్చారు. అదే విధంగా ఎంపీటీసీ 600 గజాలు, హరగోపాల్, 400 గజాలు, దస్తగిరి 20 గుంటలు ఇచ్చారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు రాము నాయక్, వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని 150 రోజులుగా రిలేదీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మండలంప్రకటించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం భూదానం చేసిన దాతలను వారు సన్మానించారు.

కురుమూర్తి స్వామీ.. పట్టించుకోరేమీ!

- దర్శనానికి వచ్చిన భక్తులకు తప్పని అవస్థలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్యదైవమైన అమ్మపూర్ కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అతి ప్రాచీన పుణ్యక్షేత్రమైన కురుమూర్తి స్వామి ఆలయానికి లక్షల్లో భక్తులు ఉన్నారు. ప్రతి శని, సోమ వారాలతో పాటు అమవాస్య, స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు వేల సంఖ్యలో స్వామిని దర్శించుకోవడానికి వస్తుంటారు. కానీ అధికారులు వారికి వసతులు కల్పించడంలో మాత్రం విఫలమవుతున్నారు. ఆదివారం సైతం అలాంటి పరిస్థితే భక్తులకు ఎదురైంది. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో అవస్థలు ఎదుర్కొన్నారు. జాతర మైదానంలో నీడటెంట్లు, దర్శనానికి వెళ్లే మెట్ల దారిలో మంచినీటి వసతి కూడా కల్పించలేదని పలువురు వాపోయారు. మధ్యాహ్న సమయంలో అన్నదానం సత్రం వద్ద ఎండలోనే బారులు తీరాల్సి వచ్చిందని ఆరోపించారు. అదేవిధంగా స్నానాలు ఆచరించేందుకు కోనేరులో నీరు లేకపోవడంతో వాటర్ ట్యాంకులను ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇబ్బందులు పడుతున్నా పాలకమండలి, అధికారులు పట్టించుకోవడం లేదని ఆలయం వద్ద కనీస కనీస సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు ఆరోపించారు. ఇన్‌చార్జ్ ఈఓ ఉండడంతో అధికారులు ప్రతిరోజు సమయపాలన పాటించడంలేదని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి వసతులు కల్పించాలని కోరుతున్నారు.



అన్నదాన సత్రం వద్ద ఎండలో బారులు తీరిన భక్తులు



జాతర మైదానంలో ఎండ వేడిమికి తట్టుకోలేక గొడుగులతో కింద చేరిన భక్తులు

వసతులు కల్పించడంలో విఫలం..



కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు వసతులు కల్పించడంలో అధికారులు, పాలకమండలి పూర్తిగా విఫలమయ్యారు. స్వామి దర్శనానికి వచ్చి ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బందులకు గురవుతున్నా ఎవరు పట్టించుకోవడంలేదు. కనీసం జాతర మైదానంలో నీడటెంట్లు, దర్శనానికి వెళ్లే మెట్ల దారిలో మంచి నీటి వసతి కల్పించడంలేదు. ఇప్పటికైనా కనీస వసతులు కల్పించాలి.

– కుర్మన్న, భక్తుడు, తీలేరు

పట్టించుకునే వారేలేరు..



స్వామి దర్శనానికి వచ్చే భక్తులను ఆలయం వద్ద పట్టించుకునే వారేలేరు. స్వామి వారిని దర్శించుకొని కాసేపు సేద తీరుదామనుకున్నాం కానీ ఎండ తీవ్రతతో ఉండలేక పోతున్నాం. చెట్ల నీడలో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నాం. భోజనం, మంచినీటి వసతులకు కూడా ఇబ్బందులు ఉన్నాయి. ఇప్పటికైనా ఇక్కడి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పద్మమ్మ, భక్తురాలు, జడ్చర్ల

ఇబ్బందులు కలుగకుండా చూస్తాం..



ఆదివారం అమవాస్యను పురస్కరించుకొని స్వామివారి దర్శనానికి భక్తులు అనుకోని విధంగా తరలివచ్చారు. అందువల్ల నీడ టెంట్లు, వసతుల ఏర్పాట్లలో కొంత జాప్యం జరిగింది. మరోసారి పొరపాట్లు జరగకుండ చర్యలు చేపడతాం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– ప్రతాప్‌రెడ్డి, కురుమూర్తి స్వామి, ఆలయచైర్మన్

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

స్టేషన్ మహబూబ్‌నగర్: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, సకాలంలో వర్షాలు కురుస్తాయని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ అన్నారు. ఆయన జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మైనార్టీ గురుకులాల అధికారులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లిలో వాలీబాల్ పోటీలు

దేవరకద్ర: గోపన్‌పల్లిలో ఆదివారం సుందరయ్యగారి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొత్తం పది జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జరిగిన పోటీల్లో కోట్ల శ్రీకాంత్‌రెడ్డి జట్టు గెలుపొందగా రూ. 2116 నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 1116 నగదు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో కాటం వరుణ్‌కుమార్‌రెడ్డి, మల్లేశ్, కృష్ణ, వినీల్, సురేష్, రాములు, వడ్డె ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అమవాస్యను పురస్కరించుకొని స్థానిక అశోక్‌టాకీస్ చౌరస్తాలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, సభ్యులు రాంచంద్రయ్య, రమేష్, ఈశ్వర్, రాజశేఖర్, సతీష్‌కుమార్, సుబ్రమణ్యం, శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాసులు, రాములు, కేశవులు, చెన్నయ్య పాల్గొన్నారు.

గోరక్షణే ధ్యేయంగా జనజాగరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: గోవుల రక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన హిందూవులను జాగృతం చేయటం కోసం జనజాగరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గుడ్డేటి చంద్రయ్య తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీ కార్యాలయంలో మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్ గోరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఈనెలలో చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు. గోవులను రక్షించాలని కోరుతూ ప్రతి సర్పంచ్‌కు వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని గోవులను బలి చేస్తారని, వాటిని ఆపాలన్నారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ మండల కేంద్రాల్లో తహశీల్దార్లకు, సీఐకి, జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు ఇస్తామని తెలిపారు. అనంతరం గోరక్షణ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కార్యదక్షులు డి.బుచ్చారెడ్డి, కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, విభాగ్ కన్వీనర్ నరేందర్, కోశాధికారి శ్రీధర్‌బాబు, హన్మంతు, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ల మార్పు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 10వ వార్డు దాచని వెంకటరెడ్డినగర్‌లో విద్యుత్ లైన్ మార్పు పనులు చేపట్టారు. వార్డులోని పోచమ్మ దేవాలయం లైన్‌లో ప్రస్తుతం ఉన్న లైన్లను మార్చి 11కేవీగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీ నిధులు రూ.6.7 లక్షలు విద్యుత్‌శాఖకు చెల్లించగా 11కేవీ లైన్ కోసం అవసరమైన 10 స్తంభాలు, తీగలు, కాసారాలు, ఇతర మెటీరియల్‌ను అందించారు. దీంతో ఆదివారం పనులను ప్రారంభించారు. లైన్‌మార్పు పనులను కౌన్సిలర్ కుమ్మరి రాజు పరిశీలించారు. పోచమ్మ ఆలయం ఉన్నందున భక్తులకు, కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కొత్తలైన్ వేయిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

బాలానగర్: ఉడిత్యాలకి చెందిన పలువురు నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

పార్టీని బలోపేతం చేయాలి

పాలమూరు: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం హామీలే తప్ప ఎస్సీలకు సరైన న్యాయం చేయలేదని, కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎస్సీలు పోరాటం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి అన్నారు. జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఎస్సీ యువ సమ్మేళనం ఆదివారం మోర్చా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ బలోపేతం చేయడానికి కృషిచేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.పీ వెంకటేష్, మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబేడ్కర్, ఎడ్ల కృష్ణయ్య, విజయ్ కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

నేను వచ్చి పనిచేయిస్తా : మంత్రి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వెంకటేశ్వర కాలనీ లోని పట్టణ ప్రకృతి వనం సమీపంలో వీధి దీపాలు వెంటనే వెలిగేలా చూడాలని మున్సిపల్ సిబ్బందిని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశించారు. ఒకటో వార్డు పరిధిలోని కాటన్‌మిల్లు సమీపంలో పిల్లలమర్రి రోడ్డు వద్ద రూ.28.57 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. కాగా, అక్కడికి వచ్చిన మహిళలు కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన మంత్రి వెంటనే ఈ సమస్య పరిష్కారం కాకపోతే తనకు మళ్లీ తెలియజేయాలని 'నేను వచ్చి దగ్గరుండి పని పూర్తిచేయిస్తా..' అని హామీ ఇచ్చారు. అనంతరం వార్డు నం.17 పరిధిలోని దొడ్డలోనిపల్లిలో రూ.ఐదు లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అలాగే రూ.20 లక్షలతో నిర్మించనున్న బేడ బుడగ జంగాల కమ్యూనిటీ హాల్ పనులకు భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల కిటకిట



నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయానికి ఆదివారం పెద్ద ఎత్తున జనం వచ్చి మొక్కుల చెల్లించుకున్నారు. బోనాలు, పూజలు తదితర వాటితో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

పరామర్శ

చిన్నచింతకుంట: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్కాపురం గ్రామంలోని సీతాదయాకర్‌రెడ్డిని, కుటుంబసభ్యులను వారి నివాసంలో ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట ఆయన వెంట జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, యాకుబ్, చిన్నచింతకుంట మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ద డెఫ్ ఆధ్వర్యంలో మూగ, బధిరుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ వలీ యొద్దీన్, ఉపాధ్యక్షులుగా మహ్మద్ సమీ ఉర్ రెహమాన్, ఎన్.శ్రీనివాస్, జితేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ధన్‌రాజ్, సహాయ కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, కోశాధికారిగా మహ్మద్ చాంద్‌పాషా, ఎక్స్‌బోర్డు సభ్యులుగా ఆచార్య మిలింద్, ఎస్‌కే జావిద్, డి.శ్రీనివాస్, శ్రీపతిరావు, జె.రాము ఎన్నికయ్యారు.

శ్రీగిరిక్షేత్రంలో చండీహోమం

జడ్చర్ల టౌన్: అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం దేవునిగుట్టతండ వద్ద ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. లోక కల్యాణార్థం ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చండీహోమం చేశారు. హోమం సందర్భంగా అన్నదానం చేశారు.

అదేవిధంగా విశ్వబ్రాహ్మణ మనుమయం సంఘం ఆధ్వర్యంలో అమావాస్య పురస్కరించుకుని గంగాపురం రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్రంగి పనులు చేసుకునే వారు సమావేశం నిర్వహించారు. ప్రతి అమావాస్య రోజున మఠం వద్ద సమావేశం ఉంటుందని సంఘం అధ్యక్షుడు శేఖర్ తెలియజేశారు. ఆదివారం అన్నదానం, సహపంక్తి భోజన కార్యక్రమానికి సత్యం, రాఘవేందర్, రఘులు సహకరించాలని తెలిపారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షుడు రవీంద్రచారి, కోశాధికారి రామకృష్ణలతోపాటు సభ్యులు పాల్గొన్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

పండుగ సాయన్న స్ఫూర్తితో పోరాటం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజలకు అండగా నిలిచిన పండుగ సాయన్న స్ఫూర్తితో పోరాటం చేద్దామని పలువురు నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్ నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పండుగ సాయన్న జన్మదినం సందర్భంగా వచ్చేనెల 23న జిల్లా కేంద్రంలోని పద్మావతీ కాలనీలో పండుగసాయన్న విగ్రహావిష్కరణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, సంజీవ్ ముదిరాజ్, మెట్టుకాడి శ్రీనివాస్, కృష్ణ, ఎస్ఎం.ఖలీల్, గోనెల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ్ ముదిరాజ్ ఇతర నాయకులు

ప్రజాపక్షం శ్రీశ్రీ ప్రస్థానం

స్టేషన్ మహబూబ్‌నగర్: మహాకవి శ్రీశ్రీ తన కవిత్వంలో ప్రజాపక్షాన్ని వహించి, అభ్యుదయ కవులకు మార్గాన్ని చూపారని ప్రముఖ కవయిత్రి, అధ్యాపకురాలు సుభాషిణి అన్నారు. తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఆదివారం శ్రీశ్రీ కవిత్వం ప్రాసంగికత అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శ్రీశ్రీ కవిత్వం, పాటలను గమనిస్తే సమాజంపై ఆయన దృక్కోణం ఆవిష్కృతమవుతుందన్నారు. ఆయన కవితలను, పాటలను వినిపించి వాటి అంతరార్థాలను చక్కగా వివరించారు. అనంతరం 25 మంది కవులు శ్రీశ్రీ గురించి తమ కవితలను వినిపించారు. ప్రముఖ గాయని పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్షుడు ఖాజా మైనద్దీన్, వల్లభాపురం జనార్దన, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రముఖ కవయిత్రి సుభాషిణి

తాగునీటికి శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఒకప్పుడు తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉండేవని, ఏ గ్రామానికి వెళ్లినా మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళనలకు దిగేవారన్నారు. నీటి ట్యాంకర్ల వద్ద గొడవలతో రచ్చ రచ్చ ఉండే పరిస్థితి ఉండేదని ప్రస్తుతం పరిస్థితి మారిందన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం బాదేపల్లి శివారులోని పందిరిగుట్ట వద్ద ఉనమిషన్‌భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన నీటి దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2014కు ముందు పట్టణంతో పాటు గ్రామాలు, తండాలు తాగునీటి కోసం అవస్థలు పడేవన్నారు. ఎండాకాలం వచ్చిందంటే పరిస్థితి మరింత దారుణంగా ఉండేదన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని అన్నారు.

జడ్చర్లకు మరో 3 ఎంఎల్‌డీ

పట్టణానికి సంబంధించి అదనంగా మరో 3 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థను స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గేట్వాల్ తిప్పి ప్రారంభించారు. ఇప్పటికే జడ్చర్లకు 7 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తుండగా వీటికి అదనంగా మరో 3 ఎంఎల్‌డీ నీటిని ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు తదితరులతో కలిసి డబ్ల్యూటీపీలోని అన్ని విభాగాలను పరిశీలించారు.కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్‌యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

బాలానగర్: మిషన్ భగీరథ నీటితోపాటు బోర్ల ద్వారా గ్రామాల్లో ఎలాంటి త్రాగునీటి సమస్య రాకుండా అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను మండల పరిధిలోని చెన్నంగుల గడ్డ తండా, పెద్దాయపల్లి గ్రామాల సర్పంచ్‌లు నీటి దినోత్సవంలో భాగంగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రశంసా పత్రాలను అందజేశారు. టీజీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ ప్రభాకర్ రెడ్డిలతోపాటు పలువురు ఉన్నారు.



గేట్‌వాల్ తిప్పి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

రాజాపూర్: మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కప్పెరిబచ్చిరెడ్డి ఆదివారం రాజాపూర్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన నీళ్ల పండుగలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయా గ్రామాల సర్పంచులు పేర్కొన్నారు. ఆదివారం గ్రామాల్లో మంచినీటి దినోత్సవం నిర్వహించారు. ఎంపీటీసీలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: మండల పరిధిలోని గ్రామాల్లో నీటి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జంగంరెడ్డిపల్లిలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, సర్పంచ్ హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అడ్డాకుల, మూసాపేట మండలాల్లో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మంచినీళ్ల పండగను నిర్వహించారు. నిజాలాపూర్, పోల్కంపల్లి గ్రామాలకు మిషన్ భగీరథ అవార్డులను జడ్చర్ల వద్ద ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందజేశారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా మంచినీటి సంబరాలను నిర్వహించారు. మిషన్ భగీరథ ఏఈ కీర్తి, ఈఓ సీత్యానాయక్ పాల్గొన్నారు.

నవాబుపేట: జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య మండలంలో వివిధ గ్రామాల్లో జరిగిన నీటి దినోత్సవాల కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. రైతుబంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, సర్పంచ్‌లు ఉన్నారు.



జంగంరెడ్డిపల్లిలో..



నవాబుపేటలో..



రాజాపూర్‌లో...



దేవరకద్రలో..

ఇసుక టిప్పర్ల పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. పోల్కంపల్లి శివారులోని పెద్దవాగు నుంచి శనివారం రాత్రి మూడు టిప్పర్లలో ఇసుకను నింపుకుని వెళ్తుండగా సమాచారం రావడంతో పట్టుకుని మూసాపేట ఠాణాకు తరలించినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్లు..

చిన్నచింతకుంట: పల్లమరి ఊకచెట్టు వాగు నుంచి ఆదివారం తెల్లవారు జామున దేవరకద్ర మండలం గూరకొండ గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా చిన్నచింతకుంట పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శంకర్‌గౌడ్‌పై కేస్ నమోదు చేశారు.

దేవరకద్ర: పెద్దరాజమూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. నాగారం గ్రామానికి చెందిన మల్లేశ్ తన రెండు ట్రాక్టర్లతో పెద్దరాజమూర్ వాగులో నుంచి ఇసుకను నింపుకుని తరలిస్తుండగా పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వితరణ

గండేడ్: వెన్నాచేడ్‌కి చెందిన గుర్రాల భీమమ్మ తన స్వంత ఖర్చుతో శవపేటికను కొనుగోలు చేసి గ్రామానికి దానం చేశారు. సర్పంచ్ పుల్లారెడ్డి సమక్షంలో అందజేశారు. పంచాయతీ కార్యదర్శి కలీం తదితరులు పాల్గొన్నారు.

